RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 151 | జులై 02 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 151 | July 02 Thursday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఆధునిక వైద్యానికి అత్యంత ప్రాధాన్యత

2

# తక్కువ నీటితో పండే పంటలు పండించండి

**హైదరాబాద్ జనసంఘర్షణ**

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితులపై అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు కీలక విజ్ఞప్తి చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగుకు మొగ్గు చూపకుండా.. తక్కువ నీటితో పండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ఆరుతడి మరియు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతానికి కురిసిన వర్షాలు వరి నార్లు పోయడానికి సరిపోయేలా లేకపోవడంతో, అందుబాటులో ఉన్న పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడమే ముందస్తు ప్రణాళిక అని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, ప్రభుత్వ సూచనలు బాగున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి అంత సులభంగా లేదు. గతంలో ప్రత్యామ్నాయ పంటలు వేసినప్పుడు ఎదురైన మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర (మీరా) లభించకపోవడం వంటి చేదు అనుభవాలు రైతులను కలవరపెడుతున్నాయి. వరి పంటకు ఉన్న మార్కెట్ భరోసా, కొనుగోలు గ్యారెంటీ ఇతర పంటలకు లేదనే భావన వారిలో బలంగా ఉంది. వరి సాగును నియంత్రించాలనే ప్రయత్నంతో పాటు ఇతర



పంటలకు కూడా సరైన మార్కెటింగ్ సౌకర్యాలు, లాభదాయకమైన ధరలు కల్పిస్తేనే ఈ మార్పు సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఈ ప్రకృతి సవాళ్లను ఎదుర్కొనేందుకు దీర్ఘకాలిక

➤ మిగతా 2వ పేజిలో..

# నేడు కేబినేట్ భేటీ



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) సమావేశం జూలై 2వ తేదీ గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు జరగనుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి భేటీ నిర్వహించనున్నారు. ఈ కీలక సమావేశం జరిగే సమయంలో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ) ఇప్పటికే స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ముఖ్యంగా, ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన ప్రతిష్టాత్మక 'మూసీ నది ప్రక్షాళన' ప్రాజెక్టుతో పాటు, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ

➤ మిగతా 2వ పేజిలో..

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**అనంతపురం జనసంఘర్షణ**

విద్యార్థులు కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా అందిపుచ్చుకుంటూ, ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. విశ్వవిద్యాలయంలో ఎన్నో కలలతో అడుగుపెట్టిన విద్యార్థులు, భవిష్యత్తు కోసం ఇక్కడ పొందిన జ్ఞానంతో నూతనోత్సాహంతో




ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశ ప్రగతిలో సమాజం పట్ల తమవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల

# అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు వేగవంతం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు. ఈ కేసులో పట్టుబడిన నిందితుల ఇళ్లపై నిర్వహించిన దాడుల్లో భాగంగా పోలీసులు రూ.70,25,000 నగదును సీజ్ చేశారు. ఇందులో అత్యధిక మొత్తంలో నగదు నిందితుడు అవినాశ్ శుక్లా నివాసంలో లభ్యమైంది. అతడి ఇల్లు, ఇతర ప్రాంగణాల నుండి రూ.20 లక్షల నగదుతో పాటు 1,121 యూఎస్ డాలర్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడైన కరుణేశ్ పాండే ఇంటి నుంచి రూ.18 లక్షలు, అనుకల్ప్ మిశ్రా ఇళ్ల నుంచి రూ.16



లక్షల నగదును

➤ మిగతా 2వ పేజిలో..

# రింగ్‌రోడ్డుపై కాల్పుల కలకలం..

**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున తీవ్ర కలకలం రేగింది. పక్కా సమాచారంతో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్‌ను పట్టుకునేందుకు వెళ్లిన నల్లగొండ సీసీఎస్ పోలీసులపై అతడు కత్తితో దాడికి తెగబడ్డాడు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద పోలీసులు అతడిని చుట్టుముట్టగా, తప్పించుకునే ప్రయత్నంలో శ్రీకాంత్ జరిపిన దాడిలో సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు తీవ్ర గాయమైంది. ఈ క్రమంలో పోలీసులు మొదట ఆత్మరక్షణ కోసం గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అయినప్పటికీ నిందితుడు లొంగకపోవడంతో, చివరకు అతడి కాళ్లపై కాల్పులు జరిపి ఎట్టకేలకు

➤ మిగతా 2వ పేజిలో..

# రెండు ట్రక్కులు ఢీ

## ఏడుగురు సజీవదహనం



**దౌసా జనసంఘర్షణ**

రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఒక అత్యంత విషాదకరమైన రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వేగంగా వెళ్తున్న ఒక బస్సు, రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రక్కును వెనుక

➤ మిగతా 2వ పేజిలో..

# ఆరు గ్యారెంటీలు, హామీల అమలులో పూర్తిగా విఫలం

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**హైదరాబాద్ జనసంఘర్షణ**

కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై ఆయన ధ్వజమెత్తారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప



ఈ

➤ మిగతా 2వ పేజిలో..

# తక్కువ నీటితో పండే పంటలు పండించండి

**మొదటిపేజీ తరువాయి..** జల నిర్వహణ ప్రణాళికలు అత్యంత అవసరమని వాతావరణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతులను, రిజర్వాయర్ల నీటి నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సి ఉంది. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించలేకపోయినా, ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, రైతు సంఘాలు సమన్వయంతో పనిచేసి ముందస్తు కార్యాచరణతో అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ సంక్షోభం నుండి గట్టెక్కవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు వేగవంతం

**మొదటిపేజీ తరువాయి..** పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రామ మందిర విరాళాల అవకతవకలపై లోతైన విచారణ జరిపేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సిట్ సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జూన్ 25న పోలీసులు అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణను ముమ్మరం చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ శుక్లా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్ ఉన్నారు. వీరికి న్యాయస్థానం జూలై 13 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం ఈ కేసులో నిందితుల బంధువులను, వారితో సంబంధాలు ఉన్న మరికొంతమందిని కూడా పోలీసులు ముమ్మరంగా ప్రశ్నిస్తున్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**మొదటిపేజీ తరువాయి..** సాధనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని, ముఖ్యంగా యువత పాత్ర అత్యంత కీలకమని రాష్ట్రపతి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఎంతమంది విద్యార్థులు ఉన్నప్పటికీ, ఏ విశ్వవిద్యాలయానికైనా తొలి బ్యాచ్ విద్యార్థులకు ఉండే గుర్తింపు విభిన్నమైనదని పేర్కొన్నారు. స్నాతకోత్సవంలో పతకాలు సాధించిన ప్రతి ఒక్క విద్యార్థికి ఆయన అభినందనలు తెలియజేస్తూ.. భవిష్యత్తు కలల సాకారానికి ఈ వేదిక ఒక బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. అలాగే, దేశంలోనే అత్యున్నత స్థానానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవిత ప్రస్థానం ప్రతి విద్యార్థికి ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి లోకేష్ కొనియాడారు.

## మీ రోజులు దగ్గరపడ్డాయి..అందుకే ఈ విమర్శలు

## నితిన్ నబీపై విమర్శలకు శుక్లా కౌంటర్

**న్యూఢిల్లీ,** : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను రేవంత్ ఎగతాళి చేయడంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ప్రేమ్ శుక్లా మండిపడ్డారు. 'మీ రోజులు దగ్గరపడ్డాయి' అంటూ హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చడంపై తెలంగాణ సీఎంకు స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతల అహంకారం, చంచల రాజకీయం త్వరలోనే కుప్పకూలుతుందని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాజయం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి అహంకారానికి త్వరలోనే తెరపడనుందన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే ఇప్పుడు కాంగ్రెస్‌కు పడుతుందని ప్రేమ్ శుక్లా హెచ్చరించారు. 'రేవంత్ రెడ్డి.. కళ్లు తెరిచి చూడండి.. 22 రాష్టాల్లో్ర అధికారంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం. రేవంత్ రెడ్డి పదవి మరికొన్ని నెలలు మాత్రమే.. మీ రోజులు దగ్గరపడ్డాయి' అంటూ బీజేపీ నేత ప్రేమ్ శుక్లా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# నేడు కేబినేట్ భేటీ

**మొదటిపేజీ తరువాయి..** ప్రాజెక్టుకు కూడా పచ్చజెండా ఊపిన నేపథ్యంలో, ఈ ప్రాజెక్టులను వేగంగా ముందుకు ఎలా తీసుకెళ్లాలనే వ్యూహాలపై మంత్రిమండలి ప్రధానంగా దృష్టి సారించనుంది. దీంతో పాటు రాష్ర్టానికి సంబంధించిన మరికొన్ని ముఖ్యమైన విధానపరమైన నిర్ణయాలపై కూడా ఈ భేటీలో చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

# ఆరు గ్యారెంటీలు, హామీల అమలులో పూర్తిగా విఫలం

**మొదటిపేజీ తరువాయి..** ప్రభుత్వం చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని హరీష్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని ఆయన ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల కంటే ఎక్కువ మొత్తాన్ని ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని, రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా అని నిలదీశారు.

ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడం కాదా అని హరీష్ రావు ప్రశ్నించారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై చర్చించేందుకు కేవలం అసెంబ్లీ మాత్రమే కాదు, ఏ వేదికపైనైనా తాము సిద్ధమని హరీష్ రావు సవాల్ విసిరారు.

# టూవీలర్‌ను ఢీకొన్న కాలేజీ బస్సు

## మహిళ అక్కడిక్కడే మృతి

**హైదరాబాద్,** : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళను ఓ కాలేజీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపగా, జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్‌కు కారణమైంది. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి హైవేపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కాలేజీ బస్సు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతతో మహిళ బస్సు కింద పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాద సమయంలో రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి రాకపోకలను క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేశారు. కొంతసేపు ఆ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొనడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# రెండు ట్రక్కులు ఢీ

**మొదటిపేజీ తరువాయి..** వైపు నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే వాహనాల్లో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉండటంతో, వారు అసలు ఏం జరుగుతుందో గ్రహించే లోపే మంటలు బస్సు మొత్తాన్ని వేగంగా చుట్టుముట్టాయి. దీనివల్ల ఏడుగురు ప్రయాణికులు ఘటనా స్థలంలోనే సజీవదహనమవ్వడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘోర ప్రమాదంలో మరో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. అదృష్టవశాత్తూ మరో 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడగలిగారు. ప్రమాదం గురించిన సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా, ఈ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమా లేక అతను నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషాద ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా శోకసంద్రం అలుముకుంది మరియు మృతుల కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# రింగ్‌రోడ్డుపై కాల్పుల కలకలం..

**మొదటిపేజీ తరువాయి..** అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన భూక్యా శ్రీకాంత్‌కు దారుణమైన నేర చరిత్ర ఉంది. మొదట్లో చిన్న చిన్న దొంగతనాలు చేసిన అతడు, 2007లో తనను అరెస్టు చేయడానికి వచ్చిన కానిస్టేబుల్ వేణుబాబును దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు 120కి పైగా నేరాలకు పాల్పడగా, ఒక్క నల్లగొండ జిల్లాలోనే అతడిపై సుమారు 300 వరకు కేసులు నమోదయ్యాయి. ఈ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ కోసం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తుండగా, హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందింది. ప్రస్తుతం ఈ ఎదురుకాల్పుల ఘటనలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌ను, అలాగే తలకు గాయమైన నిందితుడు శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

సమాజ ఆరోగ్య పరిరక్షణలో మరియు వేలాది మంది ప్రాణాలను కాపాడటంలో ప్రభుత్వ వైద్యులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. జాతీయ వైద్యుల దినోత్సవం (ణశీమ్షశీతీం' ఖుఎ) సందర్భంగా రాష్ట్రంలోని వైద్యులందరికీ ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్న డాక్టర్ల సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో బలమైనవని ఆయన పేర్కొన్నారు.

## ఆధునిక వైద్యానికి అత్యంత ప్రాధాన్యత

రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు మరియు అవసరమైన మానవ వనరుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివరించారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేశామని చెప్పారు. ఇందులో భాగంగా 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేరుస్తూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేసినట్లు గుర్తుచేశారు. డాక్టర్లతో పాటు ఇతర సిబ్బంది పోస్టులు కలిపి మొత్తం 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, అలాగే సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు (ూతీశీఎశ్రీఱశీఅం) కల్పించామని వెల్లడించారు.

వైద్య రంగంలో మౌలిక వసతుల పెంపునకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి దామోదర రాజనర్సింహ ఈ సందర్భంగా ప్రముఖంగా ప్రస్తావించారు. డాక్టర్ల దశాబ్దాల నాటి కల అయిన ఉస్మానియా నూతన హాస్పిటల్ భవన నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో కొత్త హాస్టళ్ల నిర్మాణం పూర్తికావచ్చిందని తెలిపారు. వైద్యుల అభ్యర్థన మేరకు 'సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్'ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని (ఔశీతీని జుఅజుఱతీశీఅఎవత్) కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని గుర్తుచేశారు. పాత భవనాల్లో కొనసాగుతున్న కాలేజీలు, ఆసుపత్రుల స్థానంలో అత్యాధునిక వసతులతో కూడిన నూతన భవనాలను అందుబాటులోకి తెస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని చెప్తూ.. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని వైద్యులను మంత్రి కోరారు.

# ప్రత్యామ్నాయ పంటలతో అధిక లాభాలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.





ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో రైతులు శీలం బాల్ రెడ్డి , శీలం వెంకట్ పొలంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్ సింగ్ రామాయంపేట, నిజాంపేట్ వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, లివ్ పామ్ రిసోర్సెస్ కంపెనీ మేనేజర్ , ప్రతినిధిధులు, మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు, రైతులు , తదితరులు పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్నీ ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులందరూ డిమాండ్ ఉన్న పంటలపై మొగ్గు చూపాలని, అందులో ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేనివిధంగా చట్టం ద్వారా ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఉందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టు రైతులకు మొక్కలపై రాయితితో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ , అంతర పంటల సాగు కొరకు రాయితీ సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయబడునన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాల పై రాయితీ సదుపాయం కల్పించబడునని, ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరముల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వచ్చుఅన్నారు. ప్రస్తుతం ఒక్క టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ. 23,852 /-.ఈ లెక్కన సంవత్సరమునకు రూ. 2,38,520/- ఆదాయం వచ్చు అని ,ఖర్చులు పోను ఒక ఎకరానికి సంవత్సరమునకు రూ. 2,00,000/- పొందవచ్చు. అని తెలిపారు.రైతులు తమ ఆయిల్ పామ్ ఉత్పత్తులను ఫ్యాక్టరీ వరకు రవాణా చేసుకొనుటకు అధిక ఛార్జీలు కేటాయించవలసి రావడం వలన కంపనీ వారు రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రతి 15 ని.ఎ లకు ఒక కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కంపనీ వారు గెలలను కొనుగోలు చేసిన తరువాత నియమ నిబందనల ప్రకారం 14 రోజులలోపు రైతు ఖతాకు డబ్బు జమ చేయబడుతుందనీ తెలిపారు. చివరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, దీని వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చని, ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని దొంగల, కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని కోరారు. మెదక్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు నిమిత్తం రైతులకు మొక్కలు సరాఫరా చేయుటకు వీ/o. లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ వారు చెల్మెడ గ్రామం నిజాంపేట్ మండలంలో 40 ఎకరాల స్థలంలో నర్సరీని స్థాపించడం జరిగిదన్నారు. 9ఇ9 మీటర్ల దూరంలో త్రికోణ ఆకార పద్ధతి లో మొక్కలు నాటుకోవడం వలన ఒక్క ఎకరానికి 57 మొక్కలు వచ్చునని, అంతేకాకుండా మొదటి నాలుగు సంవత్సరాలు పంట రాని దశలో అంతర పంటల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ పెట్టిన 5 సంవత్సరాల తర్వాత చాక్లెట్ తయారు చేసే పంట ఐన కోకో పంటను కానీ, వక్క పంటను కానీ నీడని తట్టుకొని పెరిగే పంటల సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు అని అన్నారు.

మెదక్ జిల్లాలో 2023-24 నుండి ఇప్పటి వరకు 1857 ఎకరాల సాగు అవ్వగా ఈ ఈ సంవత్సరం అనగా 2026-27 సంవత్సరానికి మెదక్ జిల్లాకు 2500 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటల సాగు చేయుటకు ప్రణాళికా చేసుకోవడం జరిగినదన్నారు. ఇప్పటివరకు 533 ఎకరాలకి రైతులు సిద్ధం చేసుకోగా, అందులోనుండి 152 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు పెట్టడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు బాల్ రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

- బిజెపి నాయకుల డిమాండ్.
- రామాయంపేట జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులను వేధించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి.
- డీఎం బాలకృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలి : భారతీయ జనతా పార్టీ



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)
రామాయంపేట మండలంలోని కాట్రియాల,దంతపల్లి, పర్వతాపూర్, కిషన్ తాండా, బాపనాయక్ తాండా, లక్ష్మాపూర్ తదితర గ్రామాల రైతులు ఈ ఏడాది సుమారు 30 వేల క్వింటాళ్ల జొన్న పంట సాగు చేసి పండించారు. గతంలో రామాయంపేటలో జొన్నల కొనుగోలు కేంద్రం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల సమస్యను గుర్తించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు చొరవతో రామాయంపేటలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయబడింది. కొనుగోలు కేంద్రంలో ప్రారంభంలో కొంత మేర జొన్నలను కొనుగోలు చేసినప్పటికీ, అనంతరం మార్క్‌ఫెడ్ డీఎం బాలకృష్ణ నాణ్యత పేరుతో రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. లారీలను వెనక్కి పంపించడం, మళ్లీ శుభ్రం చేసి తీసుకురావాలని చెప్పడం, తిరిగి తీసుకొచ్చిన తర్వాత కూడా కొనుగోలు చేయకుండా తిరస్కరించడం వల్ల రైతులపై భారీ ఆర్థిక భారం పడింది. లారీ అద్దెల రూపంలో రైతులు లక్షల రూపాయల నష్టాన్ని చవిచూశారు.ఈ విషయమై ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పలుమార్లు డీఎంతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కూడా పలుమార్లు వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను కూడా డీఎం పట్టించుకోకుండా రైతులను వేధించడం అత్యంత దురదృష్టకరం. ప్రారంభం నుంచే భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతుల పక్షాన నిలబడి సమస్యను కలెక్టర్, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు. గత 60 రోజులుగా బీజేపీ రైతుల తరఫున ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహిస్తూ రైతులకు అండగా నిలిచింది.డీఎం బాలకృష్ణ వ్యవహారశైలి చూస్తుంటే మాజీ మంత్రి హరీష్ రావు సూచనల మేరకు ఈ సమస్యను కావాలనే జటిలం చేసి రాజకీయ లబ్ధి చేకూర్చే ప్రయత్నం జరిగినట్లు కనిపిస్తోంది. రైతులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం అత్యంత సిగ్గుచేటు. గత పదేళ్లలో జొన్నల కొనుగోలు కేంద్రం కోసం ఎలాంటి చర్యలు తీసుకోని వారు,ఇప్పుడు రైతుల పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించడం సమంజసం కాదు. ఈ విషయాన్ని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.భారతీయ జనతా పార్టీ డిమాండ్లు రామాయంపేటలో నిల్వ ఉన్న మిగిలిన ఐదు లారీల జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలి. రైతులకు కలిగిన రవాణా,ఇతర ఆర్థిక నష్టాలకు తగిన నష్టపరిహారం అందించాలి.మార్క్‌ఫెడ్ డీఎం బాలకృష్ణపై వెంటనే శాఖాపరమైన విచారణ చేపట్టాలి.జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని డీఎం బాలకృష్ణను బాధ్యతల నుంచి తొలగించాలి. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఎం బాలకృష్ణను వెంటనే సస్పెండ్ చేసి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోంది. రైతులకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రామాయంపేట మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, దంతపల్లి సర్పంచ్ బాలరాజు, నందిగామ సర్పంచ్ ఆకుల రమేష్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు చింతల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించిన కోటగిరి గౌడ సంఘం నాయకులు



కోటగిరి),జులై 01/(జన సంఘర్షణ)
రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గీత పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్‌లను కోటగిరి మండల గౌడ సంఘం నాయకులు, కోటగిరి మండలం గీత పనివాళ్ల సంఘం నాయకులు శాలువా పూల బొకేతో సన్మానించారు. మండలంలోని ఎత్తోండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సంతాన రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు బుధవారం మండలానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోటగిరి మండల కేంద్రంలో గీత పనివాళ్ల సంఘం ఆధ్వర్యంలో బాణసంచాలు కాల్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శాలువా పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులతో మంత్రి పొన్నం పరిచయం చేసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో గీత పని వాళ్ళ సంఘం రాష్ట్ర నాయకులు విట్టల్ గౌడ్,మండల అధ్యక్షుడు వెంకగౌడ్, కోటగిరి టీసీఎస్ ఛైర్మన్ శంకర్ గౌడ్, గౌడ సంఘం నాయకులు సాయిబాబా గౌడ్, శ్రీధర్ గౌడ్, భూమా గౌడ్, రమేష్ గౌడ్, మల్లేష్ గౌడ్, మొగులా గౌడ్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు.




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జులై 01 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.


# గ్రామంలో తాగునీటి కోసం బోరు మోటర్ చుట్టూ గద్ద నిర్మించడం జరిగింది

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)
రామయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామ సర్పంచ్ మానెగల రామకృష్ణయ్య గ్రామానికి తాగునీరు సమస్య తీర్చుట కొరకు వాగులో ఉన్న బోరు మోటార్‌కు చుట్టూ గద్దె ఏర్పాటు చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ సర్పంచ్ రామకృష్ణయ్యతో మర్యాదపూర్వకంగా కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో బెల్లం చాయ్ రుచిచూసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)
మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు మెదక్ పట్టణంలో కార్యకర్తలతో కలిసి బెల్లం చాయ్‌ను ఆస్వాదించారు.మెదక్ పట్టణ ములోని చామన్ వద్ద వున్నా బెల్లం చాయ్ ఈ సందర్భంగా ఆయన మెదక్ ప్రజల ఆతిథ్యం, ఆప్యాయత, ప్రేమాభిమానాలపై ప్రశంసలు కురిపించారు.మెదక్ పట్టణ ప్రజలు ఎంతో మంచి మనసు కలిగిన వారు వారి ప్రేమ, ఆత్మీయత ఎప్పటికీ మరువలేనిది. తాగిన బెల్లం చాయ్ కూడా అదే మధురానుభూతిని కలిగించింది. ఈ చాయ్‌లోని తీపిలాగే మెదక్ ప్రజల ప్రేమ కూడా ఎంతో మధురంగా ఉంటుంది" అని మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మెదక్ పట్టణ ములోని చామన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ అవారి శేఖర్ హోటల్ వద్ద కార్యకర్తలతో కలిసి సరదాగా ముచ్చటిస్తూ బెల్లం చాయ్ తాగిన ఆయన, స్థానికులతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి మండల అభివృద్దే ఎంపీ రఘురామ రెడ్డి లక్ష్యం...ఇమ్మడి



సింగరేణి మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గౌరవ ఎంపీ రఘురామ రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు అన్నారు. ఉసిరికాయల పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆలియా తండా లో మంచినీటి ఎద్దడి ఉన్నదని గ్రామ సర్పంచ్ వరలక్ష్మిరాజు కోరడం తో ఎజూ రఘురామ రెడ్డి హ్యాండ్ బోరు మంజూరు చేసినారు. ఈ రోజు గ్రామ సర్పంచ్ వరలక్ష్మిరాజు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు మాట్లాడుతూ...ఇప్పటికే మండలంలో అనేక గ్రామాలలో అభివృద్ధికి ఎన్నో నిధులు ఇచ్చిన ఎంపీ రఘురామ రెడ్డి రానున్న రోజుల్లో మరిన్ని నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.క ార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గూగులోతు సంతోష్ నాయక్, పొంగులేటి యూత్ లీడర్ జర్పుల ధోని నాయక్, ఉసిరికాయలపల్లి సర్పంచ్ వరలక్ష్మి రాజు, మాజీ సర్పంచ్ బానోత్ బస్సీలాల్. ఉప సర్పంచ్ పొడుగు విజయ సత్యనారాయణ, పదో వార్డు నెంబరు ధరావత్ రమేష్ నాయక్, తొమ్మిదో వార్డు ఇస్లావత్ హనుమాన్ నాయక్, జరపల ధోని నాయక్, లకావత్ రాజేష్, ధారావత్ కార్తీక్, ధరావత్ మాన్సింగ్, ధారావత్ సక్రు, ధారావత్ రాంజీ. బానోత్ రాంజీ, ఇస్లావత్ వీరు నాయక్, ఉడుగుల వెంకటేశ్వర్లు, బోడ సెట్ రామ్, రెడ్డబోయిన జగ్గయ్య, గుంపిటి నాగేశ్వరరావు, లౌడియా కోటేశ్వరరావు., గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బర్ల గంగారాంను పరామర్శించిన పోచారం, కాసుల



కోటగిరి/,జులై 01/(జన సంఘర్షణ)
కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ తండ్రి కోటగిరి మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ బర్ల గంగారాం ను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి ,ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజులు బుధవారం పరామర్శించారు. ఇటీవల బర్ల గంగారాం తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి వచ్చిన సందర్భంగా ఆయనను పోచారం కాసుల కోటగిరిలోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్తితులు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్ల మధుకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాహిద్ హుస్సేన్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మాజీ ఏఎంసీ చైర్మన్ హమీద్,మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, నాయకులు జుబేర్, గంగాధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- జూలై 1 నుంచి 31 వరకు 'ఆపరేషన్ ముస్కాన్-XII.
- పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులతో పాటు బైండ్ ఓవర్ చర్యలు.
- జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 1 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఆపరేషన్ ముస్కాన్-XII బృంద సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్-XIIను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో తప్పిపోయిన బాలలు, అక్రమ రవాణాకు గురయ్యే ప్రమాదంలో ఉన్న చిన్నారులు, బాల కార్మికులు, డ్రాప్‌అవుట్ పిల్లలు, వివిధ రకాల వేధింపులకు గురవుతున్న చిన్నారులను గుర్తించి రక్షించి, సంబంధిత శాఖల సహకారంతో పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెస్క్యూ చేసిన బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేయాలని, గతంలో బాల కార్మిక చట్టాల కింద కేసులు నమోదైన వ్యక్తులు మళ్లీ అదే నేరానికి పాల్పడితే కేసులతో పాటు బైండ్ ఓవర్ చర్యలు కూడా చేపట్టాలని ఆదేశించారు. బాల కార్మికులను గుర్తించినప్పుడు తప్పనిసరిగా ఆధారాలు సేకరించాలని, డ్రాప్‌అవుట్ పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్ -XII బృందాలు బాలల న్యాయ చట్టాల ప్రకారం తదుపరి చర్యలను పకడ్బందీగా




అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్ తదితరులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు ఉప్పాలయ్య, ఆరోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు,ఎల్‌సీపీఓలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా ఎస్‌హెచ్‌వోలు, సీఐలు, ఆపరేషన్ ముస్కాన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# రైతులు,అధికారుల సమన్వయంతో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 1 (జన సంఘర్షణ)

రైతులు అధికారుల సమన్వయంతోనేఈ సంవత్సరం గంతలో కంటే ఈ సంవత్సరం 1,18,000మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు వచ్చాయాని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణరైతుల అకౌంటలో రూ.1004.13 కోట్ల రూపాయలు జమ అయ్యానట్లు తెలిపారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ జరిగిందనిన్నరు. రైతులు, అధికారుల సమన్వయంతో వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీటింగ్ హాలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్, అదనపు ఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, వ్యవసాయ ,సివిల్ సప్లై గ్రామీణ అభివృద్ధి ,పోలీసు శాఖల తో ధాన్యం కొనుగోలు విజయవంతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రైతులు, అధికారుల సమన్వయంతో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. హమాలీ, రవాణా ,రైస్ మిల్లుల్లో ధాన్యం నిలువ చేయడానికి స్థలం లేకపోడడం, అకాల వర్షాలు,లోడింగ్, ఆన్ లోడింగ్ లాంటి సమస్యలను



అధిగమించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామని, యాసంగి ధాన్యం కొనుగోళ్ల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ప్రణాళికలు చేయాలన్నారు. ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే లక్ష మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు పండించారని, జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ.1004.13 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసి అధికారులు జిల్లా యంత్రాంగం, గతంలో ఎన్నడూలేని విధంగా విస్తృతంగా రైతులకు సేవలు అందించారన్నారు. ఏప్రిల్ 10న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 29వ తేదికి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ -305, ఐకేపీ-185, డీసీఎంఎస్- 43 కేంద్రాల్లో కొనుగోలు జరిపామన్నారు. ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.1004.13 కోట్లు జమ చేశామన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలులో అదిక సమస్యలని అధిగమించి పూర్తి చేశామన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు,రామ కృష్ణ,బావయ్య, జిల్లా సివిల్ సప్లై అధికారులు నిత్యానంద, డిఎస్ ఓ డిసిఎంఎస్ జగదీష్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, రవాణా శాఖ అధికారి అశోక్ చక్రవర్తి, డిఎస్పీలు సిఐలు తహాశీల్దార్లు, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

# తపస్వి రామ్ రావ్ మహారాజ్ ఆశయాలు యువతకు ఆదర్శం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 1 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ మండలం ఔరంగాబాద్ తండాలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. తపస్వి రామ్ రావ్ మహారాజ్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హవేలీఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తండా గేట్ వద్ద శ్రీశ్రీశ్రీ తపస్వి రామ్ రావ్ మహారాజ్, ప్రేమ్ సింగ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మా దేవేందర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తపస్వి రామ్ రావ్ మహారాజు సమాజంలో ఆధ్యాత్మిక చేతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. సేవాభావం మానవతవిలువలు, ఆధ్యాత్మికతతో కూడిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలు,బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టడంతో పాటు భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని అన్నారు.అనంతరం గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యంలో పాల్గొని సందడి చేశారు. ఆమెతో కలిసి గిరిజన మహిళలు, యువత ఉత్సాహంగా నృత్యం చేయగా, భక్తులు, స్థానికులు హర్షధ్వానాలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిల్ల ఆంజనేయులు, కౌన్సిలర్ జుబెర్,నాయకులు రంజా నాయక్, ఫూల్ సింగ్, సూర్యం, శ్రీను నాయక్, మోహన్ నాయక్ రంజిత్ తరుణ్, రామచంద్ర రెడ్డి, సాప. సాయిలు, శ్రీహరి, నరేందర్ రెడ్డి,రాజు, యామిరెడ్డి, నరేందర్ నాయక్, గడ్డమీది కృష్ణ గౌడ్, మాయ. మల్లేశం, శ్రీనివాస్,శ్రీకాంత్ రెడ్డి సాయి,గ్రామ పెద్దలు, భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# గుంజాలలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

నార్నూర్/జూలై 1/(జన సంఘర్షణ




నార్నూర్: నార్నూర్ మండలం గుంజాల గ్రామానికి చెందిన చిప్పకుర్తి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాంబయ్య మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన సుగుణక్క, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుంజాల గ్రామ సర్పంచ్ కుమ్ర జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అరికిల్ల దశరథ్, బోనత్ విలాస్, జాడే సుభాష్, సేవాదళ్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో రాజకీయం వద్దు..

- రామాయంపేట మున్సిపాలిటీ చైర్మన్ లావణ్య నాగరాజు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)



జొన్న కొనుగోలుపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం తగదని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, ప్రతిపక్షాలు లేనిపోని అపోహలతో రైతులను పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. రైతుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని వారిని బజారున పడేయద్దని వారన్నారు. ఇప్పటికైనా పద్ధతి మానుకోవాలన్నారు.

# సామూహిక రోగనిరోధక శక్తి టీకాలు వల్లే సాధ్యం

- టీకా నివారణ వ్యాధుల (విపిడి) ముందస్తు నివారణపై సమావేశం.
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గణేశ్వర్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)



బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో టీకా నివారణ వ్యాధుల (బి పి డి) ముందస్తు నివారణపై ప్రభుత్వ, ప్రైవేట్ విన్న పిల్లల వైద్యులు, ఫీజీషియన్స్, చర్మవ్యాధి నిపుణులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్, జిల్లా వ్యాధుల నిఘా అధికారి డా. నవ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. జయశ్రీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. టీకాల ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు. అని వ్యక్తిగత రోగ నిరోధకశక్తితో పాటు జనాభాలో అధిక శాతం మందికి టీకాలు వేసినప్పుడు సామూహిక రోగనిరోధక శక్తి (హర్డ్ ఇమ్యూనిటీ ) పెరగడం వల్ల వ్యాధులు నియంత్రణలో వుంటాయని తెలిపారు. టీకాలు వేసుకోని వారికి వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం వున్నందున వారికి కూడా తక్షణమే టీకాలు వేయాలని తద్వారా వ్యాధులు ఒకరి నుండి ఒకరికి సోకకుండా నివారించవచ్చని, టీకాలు ప్రభావవంతంగా, సురక్షితంగా ఆరోగ్యాన్ని కాపాడుతాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చిన్న పిల్లలకు వెంటనే టీకాలు వేసి వారిని కాపాడాలని, వర్షాకాలంలో ముఖ్యంగా పిల్లలకు అంటు వ్యాధులు, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు వచ్చే అవకాశం వున్నందున క్రమం తప్పకుండా టీకాలు సిఫారస్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్ తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ డా.నవ్య మాట్లాడుతూ.. ఎవరికైనా ఏ.ఎఫ్.పి (తీవ్రమైన ఫ్లాసిడ్ పక్షవాతం), ఎం.ఆర్ (మీజిల్స్, రుబెల్లా), డి.పి.టి (డిఫ్తీరియా, పెర్టుసిస్, నియోనాటల్ టెటానస్) మొదలైన వ్యాధులకు సంభందించిన లక్షణాలు కనిపించినచో టీకాల ద్వారా నివారించే కేసులను సకాలంలో చిన్న పిల్లల వైద్యులు, చర్మ వ్యాధి నిపుణులు, ఫిజీషియన్స్ గుర్తించి జిల్లా అధికారికి వెంటనే రిపోర్టులను పంపించాలని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ.. జిల్లాలో ఏదైనా ఏ.ఈ.ఎఫ్.ఐ ( అడ్వర్స్ ఈవెంట్ ఫాలోయింగ్ ఇమ్యునైజేషన్) సంభవించినట్లయితే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలని, అనుమానిత ఏ.ఎఫ్.పి( అక్యూట్ ఫ్లాసిడ్ ప్యారాలసిస్) కేసులు, డి.పి.టి కేసులను గుర్తించినప్పుడు వెంటనే రిపోర్ట్ చేయాలని , ప్రతి సోమవారం ఎ002 ఫారంను క్రమం తప్పకుండా పంపించాలని, ప్రైవేట్ ఆసుపత్రులను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడేమాలజిస్ట్ నవ్యప్రియ, ఐ.డి.ఎస్.పి. సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీలతో ఎంపీడీవో కార్యాలయంలో కలకలం..

- రికార్డులు పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ పారిస్ కుమార్

సింగరేణి మండలం ప్రతినిధి: (జన సంఘర్షణ)





కారేపల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ పారిస్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. కార్యాలయంలోని వివిధ శాఖలకు సంబంధించిన రికార్డులు, అభివృద్ధి పనుల వివరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు తదితర అంశాలను ఆయన పరిశీలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ట్రైనీ కలెక్టర్, కార్యాలయ నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే ఒక గ్రామ పంచాయతీ కార్యదర్శి పనితీరుపై ప్రత్యేకంగా ఆరా తీసి, సంబంధిత వివరాలను సేకరించినట్లు తెలిసింది. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ స్థాయి పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించినట్లు సమాచారం. ట్రైనీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో ఎంపీడీవో కార్యాలయంలో కొంతసేపు అధికారుల్లో ఆందోళన నెలకొంది. అయితే తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఈ తనిఖీల నేపథ్యంలో సంబంధిత శాఖల పనితీరుపై సమీక్ష జరిగే అవకాశముందని తెలుస్తోంది.

# మధుర జ్ఞాపకాన్ని చెరిపేస్తారా?

- 70 యేళ్ళ గుర్తులను తొలగించడం ఏమిటీ
- ఎవరి ప్రయోజనాల కోసం
- గ్రామస్తుల మండిపాటు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)



మెదక్ మండలం మాచవరం గ్రామంలో 70 సంవత్సరాలుగా గ్రామ కూడలి వద్ద పూరి గుడిసె ఉంది. దాన్ని గ్రామస్తులు మరుపురాని జ్ఞాపకంగా కాపాడుతున్నారు. ఇటీవల గ్రామ సర్పంచ్ ఎలాంటి అనుమతులు లేకుండా ఆ గుడిసె కూల్చివేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులకు ఎన్నో జ్ఞాపకాలు, మధుర స్మృతులు, వృద్ధులకు కాలక్షేపం కబుర్లు చెప్పుకునే వేదికగా ఆ గుడిసెను కుంటి సాకులతో కూల్చడం ఏమిటని మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తీర్మానం లేకుండా గుడిసెను కూల్చడం పట్ల ఎన్ఆర్ఐలు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ఏక పక్ష నిర్ణయాలపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ గుడిసె కూల్చడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఏకపక్ష నిర్ణయంతో చిరకాల స్వప్నమైన గుడిసెను ఎందుకు కూల్చాల్సి వచ్చిందో సర్పంచ్ సమాధానం చెప్పాలని పేర్కొంటున్నారు. సర్పంచ్ నిర్లక్ష్య ధోరణిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంప్రదించే ప్రయత్నం చేయగా సర్పంచ్‌గాని, కార్యదర్శిగాని అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

# ఎతొండ ఎల్లమ్మ ఆలయంలో విగ్రహావిష్కరణ..





◆ మంత్రి పొన్నం పూజలు

నిజామాబాద్ బ్యూరో/జూలై 1/

కోటగిరి మండలం ఎల్లొండ శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మీ ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు రైతులను ఆదుకోవడానికి రైతు భరోసా, పథకాలు అందిస్తూ, మరొకవైపు మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి వడ్డీ లేని రుణాలు అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ఈ వానకాలం సీజన్లో పుష్కలంగా వర్షాలు కురిసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చని పంటలతో పంటలు కళకళలాడాలని ఆ ఎల్లమ్మ తల్లిని ప్రార్థించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# మెదక్ పట్టణంలో పెన్షన్ దారులు లైవ్ ఫోటో అధికారులకు అందజేయాలి..

◆ అధికారులకు ఇవ్వకుంటే పింఛన్లు రావు.
◆ మెదక్ మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 1 (జన సంఘర్షణ)

మెదక్ పట్టణ సమస్త వృద్ధాప్య, వికలాంగ, చేనేత, వితంతు తదితర పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులందరికీ తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ ఆదేశంల ప్రకారంగా ఎఫ్ ఆర్ ఎస్ సిస్టం ద్వారా లైవ్ ఫోటో ప్రక్రియను ప్రతి వార్డులో వార్డు అధికారులు చేయడం జరిగింది.ఇట్టి ప్రక్రియ పెన్షన్ పొందుచున్న ప్రతి ఒక్క లబ్ధిదారుడు చేయించు కోవాలని, లేని ఏడల పెన్షన్ రద్దు అవుతుందని పలు మార్లు మున్సిపాలిటీ ద్వారా వివిధ రకాలుగా తెలిజేయడం జరిగింది. కానీ,ఇప్పటివరకు పట్టణంలోని కొంత మంది లబ్ధిదారులు ఎఫ్ ఆర్ ఎస్ లైవ్ ఫోటో ప్రక్రియను చేసుకొనలేదు. దీని వలన వారి పెన్షన్ రద్దు కాబడును. ప్రభుత్వం వారు పెన్షన్ లైవ్ ఫోటో ప్రక్రియ చేయుటకు మరో చివరి అవకాశం ఇస్తూ చివరి తేదీ. 05.07.2026 వరకులి పొడిగించినారు.కావున ప్రభుత్వం నుండి పెన్షన్ పొందుతున్న సమస్త లబ్ధిదారులందరూ ఇది చివరి అవకాశంగా భావించి తమ తమ వార్డుకు సంబంధించిన వార్డు అధికారులను సంప్రదించి తమ పెన్షన్ యొక్క లైవ్ ఫోటో ప్రక్రియ చేయించుకోగలరని కోరడమైనది, లేనియెడల తమరి పెన్షన్ రద్దు కాబడును అని తెలియజేయడమైనది.

# వైద్య వృత్తి పవిత్రమైనది...

◆ వైద్య వృత్తి పవిత్రమైనదని వైద్యులు దేవుళ్ళతో సమానమని లైన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షులు హనుమంతరావు పటేల్

కోటగిరి/జూలై 1/( జన సంఘర్షణ)




కోటగిరి అధ్యక్షులు హనుమంతరావు పటేల్ అన్నారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద పాఠశాలలో అంతర్జాతీయ వైద్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో స్టార్ ఆసుపత్రి పోతంగల్ వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్‌ను సన్మానించారు. డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో కొనసాగడం అదృష్టమని పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ఎంతోమంది పేదలకు రోగులకు సేవ చేసే అవకాశం దక్కుతుంది అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి అని సూచించారు. డాక్టర్ ఇర్ఫాన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేద పాఠశాల డైరెక్టర్ లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ కార్యదర్శి తెల్ల రవికుమార్, కోశాధికారి యోగేష్ , కరస్పాండెంట్, తెల్ల అక్షర ఉపాధ్యాయ బృందం, సాయి పవన్, నాగరాజు, సాయినాథ్ , భరత్ రాము, భీమ్రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బోధన్ ఆర్టీవోకి వినతిపత్రం అందజేత

బోధన్/జూలై/(జన సంఘర్షణ)





ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ మాట్లాడుతు.. బోధన్ పట్టణంలోని యూనిక్ హై స్కూల్ ప్రైవేట్ స్కూల్ బస్సు AP20TB6907, బండారుపల్లి నుంచి శ్రీనివాస్ క్యాంప్ మార్గమధ్యలో ఈ సంఘటన జరిగింది, బస్సు స్టింగ్ హ్యాండిల్ రాడ్డు విరిగిపోయి బస్సు అదుపు తప్పింది. రోడ్డు పక్కనే చెట్టు ఉండటం వలన బస్సు ఆగింది లేకుంటే పిల్లల ప్రాణాలకు ప్రమాదం అయితుండే. కావున వెంటనే ఫిట్నెస్ లేని ప్రవేట్ స్కూల్ బస్సులను వెంటనే సీజ్ చేయాలని అన్నారు. అలాగే ప్రైవేట్ స్కూల్స్ బస్సు నడిపే డ్రైవర్లకు లైసెన్స్ కచ్చితంగా ఉండాలి. లేనియెడల స్కూల్ పైన చర్యలు తీసుకోవాలని అలాగే ఫిట్నెస్ లేని బస్సులను వెంటనే చర్యలు తీసుకోవాలి. అలాగే ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా, విద్యార్థుల ప్రాణాల భద్రత గురించి ఆలోచించి వెంటనే ప్రవేట్ స్కూల్ బస్సు ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల వైద్యుల కొరత..

బోధన్/జూలై 1/(జన సంఘర్షణ)






బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల వైద్యులు లేక ప్రజలకు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చి అప్పుల పాలవుతున్నారు. ఉన్న ఒక గైనకాలజిస్ట్ రెండు నెలల క్రితం రాజీనామా చేసి వెళ్లడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ కేసులు సున్నా శాతానికి చేరాయి. కాన్పు సమయంలో పురిటి నొప్పులతో గర్భిణీ మహిళా ఆసుపత్రికి వస్తే వైద్య సిబ్బంది పరీక్షించి ఇక్కడ గైనకాలజిస్ట్ వైద్యులు లేరని నిజామాబాద్ జిజిహెచ్ ఆసుపత్రికి వెళ్లాలని గర్భిణీ స్త్రీలకు ఎమర్జెన్సీ సమయంలో వైద్య సిబ్బంది రిఫర్ చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడైనా ఆసుపత్రి పాలకులు , ప్రజా ప్రతినిధులు స్పందించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ వైద్యులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

# జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల

◆ రైతు వేదికను గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్ మంగళవారం సందర్శించారు....

రుద్రూర్/జూలై 1/(జన సంఘర్షణ)..



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, రైతు వేదికను గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం రైతు వేదికను పరిశీలించిన సర్పంచ్, రైతు వేదిక ఆవరణతో పాటు పక్కనే ఉన్న మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించాలని, పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్, ఎంపీఓ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పంట చేనుల దారిని శుభ్రం చేయించిన సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్

సింగరేణి మండలం ప్రతినిధి: (జన సంఘర్షణ)





గాదెపాడు గ్రామంలోని పంట చేనులకు వెళ్లే ప్రధాన దారి ముళ్ల పొదలతో పూర్తిగా కప్పుకుపోవడంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ వెంటనే స్పందించి, బుధవారం జేసీబీ సహాయంతో దారిలో పెరిగిన ముళ్ల పొదలను తొలగించే పనులను చేపట్టించారు. పనులు జరుగుతున్న సమయంలో సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ స్వయంగా అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. రైతులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు, ఇతర వ్యవసాయ పరికరాలతో చేనులకు సులభంగా చేరుకునేలా దారిని పూర్తిగా శుభ్రం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామంలో రైతుల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని సర్పంచ్ తెలిపారు. రైతులు కూడా వెంటనే స్పందించి దారిని అందుబాటులోకి తీసుకురావడంపై సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# పెంటఖుర్దు గ్రామంలో మొహారం పండుగ సందర్భంగా బెల్ట్ షాపులు బంద్

◆ మొహారం వేడుకల్లో శాంతిభద్రతలపై గ్రామస్థుల ఆందోళన
◆ పెంటఖుర్దు గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని పోలీసు, ఎక్సైజ్ శాఖలకు విజ్ఞప్తి

బోధన్/జూలై1/(జన సంఘర్షణ)

బోధన్ మండలం, పెంటఖుర్దు: బోధన్ మండలంలోని పెంటఖుర్దు గ్రామంలో మొహారం పండుగను గత వందేళ్లకు పైగా హిందూ, ముస్లిం సోదరులు ఐకమత్యానికి ప్రతీకగా అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజరవుతుంటారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా కొందరు యువకులు, మద్యం సేవించిన వ్యక్తులు వేడుకల సమయంలో గొడవలకు దిగడం, పరస్పరం కొట్టుకోవడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, డబుల్ మీనింగ్ వ్యాఖ్యలు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పండుగ ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని వారు పేర్కొంటున్నారు. మొహారం వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు పండుగ రోజుల్లో గ్రామంలోని బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని, అక్రమంగా మద్యం విక్రయాలను అరికట్టాలని పోలీసు శాఖతో పాటు ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. అలాగే పండుగ సందర్భంగా పోలీసు బందోబస్తును పెంచి,

శాంతిభద్రతలను కట్టుదిట్టం చేసి మహిళలు కుటుంబ సభ్యులు భయాందోళనలు లేకుండా వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

# ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

◆ లింగంపేట్ మండలం పర్మల్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి

లింగంపేట్ మండలం/జూలై 1/(జనసంఘర్షణ)



ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై లింగంపేట్ మండలం పర్మల్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే మదన్ మోహన్ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిరాం యాదవ్ సమక్షంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో పర్మల్ల గ్రామ ఉపసర్పంచ్ కోడబోయిన శ్రీను, మాజీ మండల అధ్యక్షులు చంద్రబాబు, సొసైటీ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కోడబోయిన శ్రీనివాస్, మాజీ బీఆర్ఎస్ అధ్యక్షులు గంట బాబు తదితర ప్రముఖ నాయకులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.



వీరితో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు బద్ద రాజులు, ఇర్ల సాయిబాబు, కాశ ప్రశాంత్, ఇర్ల గోపాల్, రాజారెడ్డి, డీలర్ రాజు, చాకలి రవి, ఇర్ల సాయిలు, లేగ్గెల సాయిలు, పల్లె శేఖర్, రావుల శ్రీను, మంద రమేష్, గంట ఇస్తారీ, సాంబని గోపాల్, గంట శ్రీను, పద్మారావు, బెస్త భాగయ్య, ఇర్ల పరమేశ్, జగతి రవి, బెస్త నర్సింలు, మంద ప్రవీణ్, బద్ద కిష్టయ్య, ఇర్ల మోహన్, మన్నె రాము, గంప రవి, పోచాగౌడ్ తదితర గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
గురువారం 02 జూలై 2026

# హుంసా గ్రామంలో పల్లె దవాఖాన ప్రారంభించిన ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి

- **మహాలక్ష్మిమాత విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని గ్రామ అభివృద్ధికి పలు హామీలు**

బోధన్ హుంసా/జూలై 1/(జన సంఘర్షణ)

సాలూరా మండలంలోని హుంసా గ్రామంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మహాలక్ష్మిమాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యటన సందర్భంగా గ్రామస్తులు, రైతులు పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ హైస్కూల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రైతులు పొలాలకు వెళ్లే రహదారి, కుమ్మన్‌పల్లి రోడ్డులో బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని



సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ దేవాలయాల ముందు సీసీ రోడ్ల నిర్మాణానికి, భీరప్ప మందిరం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులను త్వరలోనే మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పల్లె దవాఖాన, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ఉచితంగా భూములు విరాళంగా ఇచ్చిన దాతలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను, దాతలను ఘనంగా సన్మానించారు.



ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హందన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, సాలూరా కాంగ్రెస్ అధ్యక్షుడు మందర్నా రవి, బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, హుంసా గ్రామ సర్పంచ్ మార్కల్ శివకుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాన్సువాడలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం..





- **ప్రభుత్వ సలహాదారు పోచారం నివాసంలో డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మర్యాదపూర్వక ఆహ్వానం**

బాన్సువాడ/, జూలై 1:/(జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని సర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వివరించారు. ప్రజల్లో ఎలాంటి అపోహలకు తావులేకుండా, సర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూ ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో మంత్రి సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రామదేవతల కృపాకటాక్షంతోనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయి

- **గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం**
- **హైదరాబాదులో బోనాల పండుగకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు**
- **రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్**

కోటగిరి),జులై 01/( జనసంఘర్షణ)

గ్రామదేవతల కృప కటాక్షాలు ఉంటేనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండలం లోని ఎత్తోండ గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు స్థానిక గౌడ సంఘం నాయకులు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ లతో కలిసి విగ్రహ ప్రతిష్టాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ఎత్తొండలో సంతాన రేణుకా ఎల్లమ్మ దేవాలయం నిర్మించి ప్రారంభోత్సవానికి తమను పిలవటం ఆనందంగా ఉందన్నారు. గ్రామ దేవతలను పూజించే గ్రామాలు ఆ దేవతల దీవెనలు,కృపాకటాక్షంతో చల్లగా ఉంటాయని చెప్పారు. అమ్మవారి చల్లని చూపు గ్రామ ప్రజలందరిపై





తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండేలా ఈసారి ఎల్లమ్మ తల్లి దీవెనలతో సమృద్ధిగా వర్షాలు పడి, పాడి పంటలు బాగుండాలని వేడుకున్నారు. హైదరాబాదులో ప్రతిష్టాత్మకంగా నెల రోజులపాటు నిర్వహించే బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. అంతేకాకుండా గ్రామీణ స్థాయిలో ఉన్న గ్రామ దేవతలకు సైతం దేవాదాయ ధర్మాదాయ శాఖ తరఫున రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. ఆలయాల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తూ గ్రామీణ ప్రజలు విశ్వసించే గ్రామ దేవతలకు నూతన నిర్మాణానికి ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, కోటగిరి ఏఎంసీ చైర్మన్ గాయక్వాడ్ హన్మంతు ,స్థానిక సర్పంచ్ శ్వేత సూర్యకాంత్, ఉమ్మడి మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, బర్ల మధు, షాజీ పటేల్, ఎత్తొండ క్యాంప్ సర్పంచ్ వీరమణి, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్,స్థానిక గౌడసంఘం నాయకులు శ్రీధర్ గౌడ్ , గంగాధర్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ హమీద్, ఎత్తోండా మాజీ సర్పంచ్ ఆనంద్, ఎత్తొండ హై స్కూల్ హెచ్‌ఎం అలివేలు, నాయకులు జుబేర్, రాంబాబు,ఆయా గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డివిజన్ ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా

- **ఏఓ సాయిలుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది**
- **సిఐటియు కార్మిక సంఘం..**

బోధన్/జూలై 1/(జన సంఘర్షణ)



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక చీూ=ఇ. ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది.. సిఐటియు జిల్లా అధ్యక్షులు. జీ శంకర్ గౌడ్. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజాంబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఏషాల. గంగాధర్. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు. భాగ్యలక్ష్మి, వారి ఇరువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం. జులై ఒకటో తారీకు నుంచి దేశవ్యాప్తంగా బి బి జి రామ్ జి చట్టం అమలు చేయిస్తుంది. దాన్ని అమలు చేయకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మాత్రమే అమలు చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ చట్టం రద్దు చేయాలని, కోరుతూ కనీస మద్దతు ధర కల్పించాలని, దేశవ్యాప్తంగా వికలాంగులకు కేంద్ర ప్రభుత్వం 5000 పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 6000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ పైన ఆర్డిఓ ఆఫీస్ వద్ద ధర్నా చేసి ఏవో సార్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గతంలో ఉపాధి పనిలో రాష్ట్ర ప్రభుత్వం 10% కేంద్ర ప్రభుత్వం 90% నిధులు కేటాయించి పనిని కల్పించేది కానీ దాన్ని మార్చి రాష్ట్ర ప్రభుత్వం 40% కేంద్ర ప్రభుత్వం 60 శాతాన్ని పెడుతూ ఉపాధి హామీ కూలీలకు పని లేకుండా చేసే ప్రయత్నాలు చేస్తా ఉంది. ఇది సరైన పద్ధతి కాదు ఇప్పటికే గ్రామాలలో వికలాంగులకు ఉపాధి పని కల్పించకుండా అంకులు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు కొత్త చట్టం పేరుతో ఫోటో క్యాప్స్ పేరుతో పని లేకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి వీటిని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని లేనిపక్షంలో గల్లి నుంచి ఢిల్లీ దాకా దేశవ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. దీనితోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తూ పాత పద్ధతిలోని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు గైని రాములు, డివైఎఫ్ఐ. జిల్లా నాయకులు దాసి గోపి, ఎన్‌పీఆర్‌డీ జిల్లా ఉపాధ్యక్షులు కాలగడ్డ రాజు, జిల్లా సహాయ కార్యదర్శి ముంజం సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు. రైముద్దిన్, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఇట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ నిజాంబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి. ఏషాల గంగాధర్. 9010585377

# చెరువు దగ్గర ఆగిన ఆటో..

- **అనుమానంతో డ్రోన్ కెమెరాతో జూమ్ చేయగా..**
- **రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఇద్దరు!**

హైదరాబాద్/జూలై 1/(జన సంఘర్షణ)



హైదరాబాద్ మహానగరంలో ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు పోలీసులు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నిఘా నిర్వహించారు. ఈ నిఘా సందర్భంగా అనుమానాస్పదంగా చెరువు సమీపంలో ఆగి ఉన్న ఓ ఆటోపై డ్రోన్ కెమెరా దృష్టి సారించింది. కెమెరాను జూమ్ చేసి పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నట్లు స్పష్టంగా గుర్తించారు. డ్రోన్ కెమెరా రికార్డు చేసిన ప్రత్యక్ష దృశ్యాలు వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరాయి. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ పోలీస్ బీట్ కానిస్టేబుల్‌ను అప్రమత్తం చేశారు. ఆయన తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమైన చర్య కావడంతో, పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనతో డ్రోన్ నిఘా వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తుందో మరోసారి రుజువైందని పోలీసులు తెలిపారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం డ్రోన్ నిఘాను మరింత విస్తృతంగా అమలు చేస్తామని అధికారులు వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సుమతి హెచ్చరించారు.

## అంబేద్కర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్ (ఎండీఎం) ప్రవీణ్, డీసీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి

రుద్రూర్/జూలై 1/(జన సంఘర్షణ)





నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్ (ఎండీఎం) ప్రవీణ్, డీసీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంటగదిని తనిఖీ చేసి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించి, విద్యార్థుల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. పాత పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని గుర్తించిన అధికారులు, ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సమగ్ర నివేదిక పంపించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.


జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
02 జులై 2026

# గైక్వాడ్ భీమ్రావుపై తిరగబడ్డ జనం

- గ్రామస్తులంతా ఏకమై తిరుగుబాటు...
- గ్రామానికి చెందిన భూమి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన గైక్వాడ్ భీమ్రావుకు తగిన గుణపాఠం చెబుతాం గ్రామస్తులు

పొతంగల్ /హంగర్గా ఫారం/(జన సంఘర్షణ) అశోక్ కామ్లే

పొతంగల్ మండలం హంగార్గా ఫారం గ్రామంలో గైక్వాడ్ భీమ్రావు అనే వ్యక్తిపై గ్రామస్తులంతా తిరుగుబాటు చేశారు. సదురు వ్యక్తి అట్రాసిటీ కేసుల పేరుతో చాలామందికి భయభ్రాంతులకు గురి చేస్తూ, అంతేకాకుండా చాలామందికి కేసులపేరుతో భయభ్రాంతులకు గురి చేస్తారని అలాంటి వాటికి భయపడేది లేదని తాము సైతం ఎక్కడికైనా చట్టపరంగా వెళ్తామని, అన్ని కులాలు అన్ని మతాలవారు కలిసి ప్రభుత్వ భూమిని కాపాడుకోవడంలో ఇన్వాల్వ్మెంట్ అయ్యామని కానీ గాయక్వాడ్ భీమ్రావు మాత్రం ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంలో ఎంతటికైనా తెగిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. అక్రమ కేసుల పేరుతో దౌర్జన్యం చేస్తున్నాడని తాము భయపడేది లేదని ఎక్కడికైనా, ఎంతకైనా పోరాడుతామని గ్రామస్తులు హెచ్చరికలు చేశారు. అంతేకాకుండా గైక్వాడ్ భీమ్రావు పై తిరుగుబాటు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గైక్వాడ్ భీమ్రావు అనే వ్యక్తి తన పొలం అనుకొని ఆ పొలం పక్కనే ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిలో ప్రభుత్వం వేసిన బోర్లు ఉన్నాయని ఈ బోరు ద్వారా గ్రామ ప్రజలందరికీ నీరు సరఫరా అవుతుందని, అంతేకాకుండా ఈ భూమిలో గ్రామ యువకులు పిల్లలు క్రికెట్ తో పాటు వివిధ ఆటలు ఆడుకుంటారని గ్రామస్తులు తెలిపారు. ముమ్మాటికి ఇది గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమి అని, అలాంటి భూమిపై గైక్వాడ్ భీమ్రావు కన్ను వేసి కబ్జా వేసుకోవడంలో ట్రాక్టర్ల ద్వారా దున్నే కార్యక్రమం చేయడం జరిగిందని, విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా ఏకధాటిగా అక్కడికి వెళ్లారు,


ఇట్లు
హంగర్గ ఫారం గ్రామ ప్రజలు
మరియు యూత్ పిల్లలు
మం॥ పొతంగల్, జి॥నిజామాబాద్
14 DEC 2022



అంతేకాకుండా దున్నే ట్రాక్టర్ ను ఆపివేశారు, ఈ భూమి గ్రామానికి సంబంధించిన ఆస్తి అని దీని దీనిపై హక్కు లేదని తిరగబడ్డారు, ఏ విధంగా దున్ని కబ్జా చేస్తారని వారు తిరుగుబాటు చేశారు. ఈ విషయంలో గైక్వాడ్ భీమవరం అనే వ్యక్తి అట్రాసిటీ కేసు పెడతామని కేసులు పెడతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎంత భయపెట్టినా తాము భయపడేది లేదని చట్టపరంగా తాము సైతం పోరాడుతామని గ్రామస్తులు హెచ్చరికలు చేశారు. గైకొట్ భీమ్రావు అనే వ్యక్తి ఈ గ్రామానికి చెందినవారు కాదని అయినా గ్రామానికి సంబంధించిన వ్యక్తిగా చలామణి అవుతూ గ్రామంలో ప్రతి ఒక్కరిపై కేసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తారని ముఖ్యంగా అట్టర్ సిటీ పెట్టి లోపట వేయిస్తానని ప్రతి ఒక్కరిపై భయభ్రాంతులకు గురిచేస్తూ కాలం వెళ్ళదిస్తాడు అని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిపై గుండాయిజం, రౌడిజం చేయడమే కాకుండా పోలీస్ స్టేషన్లో తప్పుడు ఫిర్యాదులు చేసి కేసులపేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ కాలం వెళ్ళీయడమే కాకుండా ప్రతి ఒక్కరి వద్ద పైసలు వసూలు చేస్తూ, అంతేకాకుండా ఉద్యోగాలు ఇప్పిస్తానని అదేవిధంగా ఇతర పనులు చేయిస్తానని అమాయక జనం వద్ద భారీగా డబ్బులు వసూలు చేస్తాడని ప్రతి ఒక్కరికి మోసం చేయడం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య అని ఎవరైనా ప్రశ్నించిన ఎదురు తిరితే తప్పుడు కేసుల పేరుతో భయభ్రాంతులను గురిచేయడం అలవాటుగా మార్చుకున్నాడని ఇదే వృత్తిగా మార్చుకున్నారని ఇలాంటి వ్యక్తి చాలా సమాజానికి చేటు అని . ఇలాంటి వ్యక్తి భయభ్రాంతులకు గుర్తిస్తే భయపడేది లేదని ఆయన ఆగడాలు కొనసాగనివ్వమని, గ్రామస్తులు హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమపై అక్రమ కేసులు పెట్టడం జరిగిందని ఎంత అక్రమ కేసులు పెట్టిన తమ భయపడేది లేదని గ్రామంలో అన్ని కులాలు అన్ని మతాలవారు ఏకమై ప్రభుత్వ భూమిని కాపాడుకోవడంలో పనిచేస్తున్నామని అవసరమైతే ఎంతటి ఉద్యమాలు అయినా చేస్తామని భయపడి వెనుకంజ వేసి ప్రసక్తి లేదని అన్నారు. ప్రభుత్వ భూమిల దున్నడమే కాకుండా తమపై తప్పుడు కేసులు చేయడం కోసం పోలీస్ స్టేషన్ వెళ్లడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం పోలీసులు వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

# తెలంగాణలో బీజేపీ కనుమరుగైంది..

- మంత్రి పొన్నం ప్రభాకర్?

ఆర్మూర్/జూలై 1/(జన సంఘర్షణ)

రాష్ట్రంలో బీజేపీ కనుమరుగైందని, బీఆర్ఎస్తో,పొత్తు పెట్టుకుని అక్కడక్కడా బీజేపీ సీట్లు సాధించిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఖాందేశ్ శ్రీనివాస్ కూతురు వివాహం ఇటీవల జరుగగా.. బుధవారం మంత్రి వారి ఇంటికి వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు.

**పలు రాష్ట్రాల్లో ఓట్లు తారుమారు..**

అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక ఒటరు సవరణ ప్రక్రియ 'సర్' పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించి ఫలితాలను తారుమారు చేశారన్నారు. తెలంగాణలో, సైతం అదేవిధంగా ప్రయత్నం జరిగే అవకాశం ఉందన్నారు. భారత ఎన్నికల కమిషన్ బీజేపీ అనుబంధ సంస్థగా మారిందని ఆయన ఆరోపించారు. 20 ఏళ్లకు ఒకసారి ఈ ప్రక్రియ జరుగుతుందని గతంలో 2002లో ప్రజాస్వామ్య బద్ధంగా అర్హులైన ఓటర్లలో మిస్ కాకుండా నిర్వహించారని, ప్రస్తుతం అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రతి ఓటర్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణకు వచ్చిన బీజేపీ అధ్యక్షుడు తాను వచ్చినట్లు రాష్ట్ర ప్రజలు మాట్లాడుకోవాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ను విమర్శించారన్నారు. 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలన్నారు. విభజన హామీలు సైతం నెరవేర్చే పరిస్థితుల్లో లేదన్నారు.



# ఆరోగ్య పరీక్షలు వాయిదా వద్దు..

- మహిళా వైద్యులకు నిపుణుల సూచన

హైదరాబాద్/జూలై 1/(జన సంఘర్షణ)


సమాజానికి వైద్యం అందించే డాక్టర్లు.. తరచూ తమ ఆరోగ్యాన్ని మాత్రం విస్మరిస్తుంటారు. ప్రతి ఏటా 'ఫుల్ బాడీ చెకప్' చేయించుకోవడం, రక్తపోటు, షుగర్ స్థాయిలు, కొలెస్ట్రాల్ , థైరాయిడ్ వంటి పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించుకోవడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వీటిని వాయిదా వేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు

**న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్ సూచనలు....**

ఈ అంశంపై న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్ చీఫ్ డాక్టర్ అంకిత శ్రీవాత్సవ స్పందిస్తూ.. "మహిళా వైద్యులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అంటే అది స్వార్థం కాదు, తమ బాధ్యతలను మెరుగ్గా నెరవేర్చడానికి అది ఒక అవసరం" అని పేర్కొన్నారు. వయసు, వ్యక్తిగత ఆరోగ్య చరిత్రను బట్టి రక్త పరీక్షలతో పాటు.. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, ఎముకల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె సూచించారు.

**ఆరోగ్యమే అందరి బాధ్యత....**

"ఒక ఆరోగ్యవంతమైన వైద్యురాలు తన రోగులకు మరింత మెరుగ్గా చికిత్స అందించడమే కాకుండా, తన కుటుంబానికి అండగా నిలవగలరు" అని డాక్టర్ అంకిత వివరించారు. ఏటా చేయించుకునే ఆరోగ్య పరీక్షలు భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడి వంటివని, దీనిపై ప్రతి మహిళా డాక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె కోరారు. సమాజానికి వైద్యం అందించే డాక్టర్లు.. తరచూ తమ ఆరోగ్యాన్ని మాత్రం విస్మరిస్తుంటారు. ముఖ్యంగా మహిళా వైద్యులు వృత్తిపరమైన బాధ్యతలు, ఇంటి నిర్వహణలో బిజీగా ఉంటూ తమ సొంత ఆరోగ్య అవసరాలను రెండో ప్రాధాన్యతగా మారుస్తున్నారు. ఈ అలవాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్య వృత్తి అంటేనే తీవ్రమైన ఒత్తిడి, సుదీర్ఘ పని గంటలు. వీటికి తోడు కుటుంబ బాధ్యతలు కూడా నెత్తిన వేసుకున్న మహిళా వైద్యులు, తమ గురించి శ్రద్ధ తీసుకోవడానికి తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు. క్రమం తప్పకుండా చేయించుకోవాల్సిన రక్త పరీక్షలు, స్క్రీనింగ్లను వాయిదా వేయడం లేదా చిన్నపాటి అనారోగ్య లక్షణాలను పట్టించుకోకపోవడం సర్వసాధారణమైపోయింది. ముందస్తు పరీక్షలే అసలైన రక్షణ..



# సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్. క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చెయ్యాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 1 (జన సంఘర్షణ)

ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026( సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026) లో భాగంగా బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పై బాధ్యతగా మెలిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం దిశగా భాగస్వామ్యం కావాలన్నారు ఇంటి వద్దనే ఘన వ్యర్థాలు నాలుగు విభాగాలుగా వేరుచేసి గ్రామపంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. నాలుగు రకాల చెత్త తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త ప్రత్యేక జాగ్రత్త చెత్త గా వేరుచేసి ఇవ్వాలని,తడి చెత్తకు ఆకుపచ్చ రంగు డస్ట్ బిన్, పొడిచేతకు బ్లూ కలర్ డస్ట్ బిన్, సానిటరీ చెత్తకు రెడ్ కలర్ డస్ట్ బిన్ ప్రత్యేక జాగ్రత్త చెత్తకు వాడా బ్లాక్ కలర్ డస్ట్ బిన్ లను వాడాలని తెలియజేయడం జరిగిందన్నారు. మెదక్ జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు మరియు అన్ని గ్రామపంచాయతీలో,అన్ని గ్రామపంచాయతీ, మండల, డివిజన్ జిల్లా ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో, షాపుల్లో , పరిశ్రమల్లో డాబాల్లో హోటల్స్ లో రైల్వేస్టేషన్లో, బస్టాండ్లలో హాస్పటల్లో తప్పనిసరిగా చెత్తను నాలుగు రకాలుగా వేరుచేసి ఇవ్వాలని అధికారులకు ప్రైవేట్ యాజమాన్యాలకు, ప్రజలకు, మహిళా సంఘాలకు సూచించారు. తడిచిత్తలో భాగంగా మిగిలిన ఆహారము, వంటింటి చెత్త,కూరగాయలు, పండ్ల తొక్కలు,వాడిన పూలు ,మాంసము చెత్త మొదలగునవి ఉంటాయని వీటితో కంపోస్ట్ ఎరువు తయారు అవుతుందని తెలిపారు. పొడి చెత్తలో భాగంగా కాగితము,అట్టపెట్టెలు ప్లాస్టిక్ వస్తువులు,లోహపు వస్తువులు, సీసాలు, రబ్బరు మొదలైనవి రీసైక్లింగ్ చేయగలిగినవి ఉంటాయని తెలిపారు. సానిటరీ వేస్ట్ లో భాగంగా డైపర్లు, సానిటరీ ప్యాడ్స్, నాప్కిన్లు, కండోమ్స్ మొదలైనవి ఉంటాయి ఉంటాయని, వీటిని సపరేటుగా తీసుకొని ఇన్సులిరేటర్స్ యంత్రంలో పెట్టి డిస్పోజ్ చేస్తారని తెలిపారు. ప్రత్యేక జాగ్రత్త చెత్త అనగా పెయింటింగ్ డబ్బాలు, బల్బులు, పురుగుమందుల డబ్బాలు, టాబ్లెట్స్ గడువు ముగిసిన మందులు,మెడికల్ వ్యర్థాలు మొదలనే ఉంటాయి, ఎలక్ట్రానిక్ వేస్ట్ ఉంటాయని వీటిని గుర్తింపు కలిగిన రీసైక్లింగ్ డీలర్లకు పంపడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నాలుగు రకాల చెత్తను తీసుకొనుటకు ట్రాక్టర్లో నాలుగు రకాల పెద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా సర్పంచులు, వార్డు మెంబర్లు లీడ్ ఫెసిలిటేటర్స్ గా గ్రామంలో ప్రతి ఒక్కరికి దీనిపైన ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. బల్క్ వేస్ట్ జనరేటర్స్ తప్పకుండా ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ పాటించాలని తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ,అడిషనల్ కలెక్టర్ నగేష్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ జిల్లా పరిషత్ సిఈ ఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిఆర్వో అంబదాస్ రాజేశ్వర్ తాసిల్దారులు, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, అధికారులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.





# జుక్కల్లో ఆర్టీసీ బస్ డిపో, బీసీ స్టడీ సర్కిల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే వినతి

- జుక్కల్లో ఆర్టీసీ బస్ డిపో, బీసీ స్టడీ సర్కిల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే వినతి.
- మంత్రి పొన్నం సానుకూల స్పందన
- మంత్రి పొన్నంకు గజామలతో ఘన స్వాగతం

జుక్కల్,/జూలై 1/(జన సంఘర్షణ)






కామారెడ్డి జిల్లా పర్యటన ముగించుకుని జుక్కల్ నియోజకవర్గం మీదుగా హైదరాబాద్ వెళ్తున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కాంగ్రెస్ నాయకులతో కలిసి గజ్జమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి ఆత్మీయ అభివాదాలు తెలియజేస్తూ, జుక్కల్ నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్షలైన ఆర్టీసీ బస్ డిపో, బీసీ స్టడీ సర్కిల్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే , పి ఏ అక్రమ ఇసుక దందా

- అడ్డుకున్న గ్రామస్తులు ...
- ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమాలకు పాల్పడుతున్న పిఏ కిషోర్

కామారెడ్డి/జూలై 1 (జన సంఘర్షణ)





ప్రజల చేత ఎన్నుకోబడ్డ ఎమ్మెల్యే నియోజకవర్గంలో అందుబాటులో లేకుంటే ఆయన వ్యక్తిగత సహాయకుడు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిన వ్యక్తి అవినీతికి, అక్రమ ఇసుక దందాకు పాల్పడితే ఇక ప్రజలు ఎవరికీ సమస్యలు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఉంది అంటూ గ్రామస్తుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఒకవైపు నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే ఆయన వద్ద పనిచేస్తున్న వ్యక్తిగత సహాయకుడు కిషోర్, ఎమ్మెల్యే పేరు చెప్పి పెద్ద ఎత్తున అక్రమ ఇసుక దందకు కొన్ని రోజులుగా పాల్పడుతున్నారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం గుండె నెమలి మంజీరా నది నుంచి బుధవారం రాత్రి 10 గంటలకు టిప్పర్లలో ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పిఎ అయితే అక్రమ ఇసుక దందా చేస్తారా? అంటూ గుండె నెమలి గ్రామస్తులు ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు పై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పిఎ కిషోర్అక్రమఇసుక దందా కాకుండా పనులు నిమిత్తం వచ్చే వారి నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు రాత్రిపూట ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వ్యక్తిగత సహాయకుడు కిషోర్ మంజీరా నది నుంచి టిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగిస్తూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వ్యక్తిగత సహాయకుడు కిషోర్ చేస్తున్న అక్రమ ఇసుక దందా గురించి కొంతమంది బాన్సువాడకు చెందిన విలేకరులు ఈ విషయంపై అధికారులకు, పోలీసులకు సమాచారం అందించినట్లు తెలుస్తుంది. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వ్యక్తిగత సహాయకుడు కిషోర్ మంజీరా నది నుంచి ఇసుక తరలిస్తూ కొంతమంది విలేకరులకు డబ్బులు అందిస్తూ అక్రమ ఇసుక దందా కొనసాగిస్తున్నారు. కొన్ని రోజులుగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వ్యక్తిగత సహాయకుడు కిషోర్ విలేకరులకు డబ్బులు ఇవ్వడం లేక పోవడంతో ఆయన చేస్తున్న అక్రమ దందా ను బయటపెట్టారు. గుండె నెమలి గ్రామస్తులు సైతం ఎమ్మెల్యే పిఏ చేస్తున్న అక్రమ ఇసుక దందా అడ్డుకొని పోలీసులకు అప్పగించారు, ఎమ్మెల్యే పి ఏ కిషోర్ అక్రమాలు జూకర్ నియోజకవర్గంలో సాగుతున్నాయి. ఎమ్మెల్యే, పి ఏ అనగానే కొంతమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు భయపడి ఆయన చెప్పిన విధంగా నడుచుకుంటూ పిఏకు కావలసిన కాసులు అందిస్తున్నారు. అంతేకాకుండా తనకు ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అండదండలు ఉన్నాయ్ అన్న ధీమాతో కిషోర్ పెద్ద ఎత్తున ఆస్తులు కూడా పెట్టుకోవడానికి ప్రయత్నాలు భాగంగా ఈ అక్రమ ఇసుక దందా ఒకటి. అయినా చేస్తున్న అక్రమ దందాలపై లోతుగా విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి. రెడ్ హ్యాండుగా ఎమ్మెల్యే పి ఏ కిషోర్ బుధవారం రాత్రి గుండె నెమలి నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని టిప్పర్లను పోలీసులకు అప్పగించారు. ఇసుక టిప్పర్లకు పట్టించడంలో కొంతమంది విలేకరులు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్పందన ఏవిధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.

# ఎపిసెట్ ఫలితాల్లో మదర్ థెరిసా జూనియర్ కళాశాల ప్రభంజనం

పలమనేరు, జూలై 01 ( జన సంఘర్షణ) :

2026 మే నెలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎపిసెట్ ఫలితాలలో స్థానిక మదర్ థెరిసా జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి, మరోమారు కళాశాల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేశారు. కళాశాల విద్యార్థులు సాధించిన అద్భుతమైన ర్యాంకుల వివరాలను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు బుధవారం మీడియాకు వెల్లడించారు. 3,138 వ ర్యాంకుతో సాయి షణ్ముఖ, 5,813 వ ర్యాంకుతో హర్షవర్ధన్, 7,953 వ ర్యాంకుతో పావన శ్రీ, 8,571 వ ర్యాంకుతో శ్వేతలు. ఇలా 10 వేలు లోపు ర్యాంకులు నలుగురు సాధించారు. 20 వేలు లోపు ర్యాంకులు 22 మంది, 50 వేలు లోపు ర్యాంకులు 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ… కళాశాల నుండి మొత్తం 342 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందులో 304 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో అర్హత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపక బృందం అందించిన నాణ్యమైన శిక్షణ, విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని ఆయన కొనియాడారు. ఈ అద్భుత విజయానికి కారకులైన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను మరియు నిరంతరం శ్రమించిన అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ సునీల్, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, మరియు ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి లు ప్రత్యేకంగా అభినందించారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఏఐ స్మార్ట్ సొల్యూషన్..

- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్/జూలై 1/(జన సంఘర్షణ)



హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ట్రాఫిక్ పరిస్థితులకు అనుగుణంగా సిగ్నల్స్ స్వయంచాలకంగా పనిచేసే ఏఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు అనలాగ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ పి.వి. కృష్ణారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమై ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. సమావేశంలో ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఒకే ఇంటిగ్రేటెడ్ వ్యవస్థలో అనుసంధానం చేయాలని, వాతావరణ పరిస్థితులు, ట్రాఫిక్ తీవ్రతను ఏఐ ద్వారా విశ్లేషించి సిగ్నల్స్ స్వయంచాలకంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినిధులు వివరించిన ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ద్వారా ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించడం, నీటి లీకేజీలు వంటి సమస్యలను వేగంగా గుర్తించడం, విద్యుత్ వినియోగాన్ని అవసరానికి అనుగుణంగా నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలకు గ్రీన్ కారిడార్ కల్పించడం వంటి అనేక సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అనలాగ్ సంస్థ, మధ్య ఫిజికల్ ఇంటెలిజెన్స్ అమలుకు సంబంధించిన అవగాహన ఒప్పందం (వీశీఖ) ముఖ్యమంత్రి సమక్షంలో పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్‌ను దేశంలోనే అత్యాధునిక కాగ్నిటివ్ సిటీగా తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగుగా భావిస్తున్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు ఘన సన్మానం

- మహాత్మా ప్రెస్ క్లబ్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కారం
- ఆస్పత్రికి అవసరమైన సహకారం అందిస్తాం: వాసవి క్లబ్ జోన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు

జన సంఘర్షణ 1-7-2026



### వైద్యుల సేవలను కొనియాడిన ప్రముఖులు

అశ్వారావుపేట, జూలై 1: జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలువురు పత్రికా విలేకరులు ఘనంగా సన్మానించారు. వైద్యులకు శాలువాలు కప్పి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను అభినందించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

### వైద్యుల సేవలకు గుర్తింపుగా సన్మానం

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యుల సేవలు అమూల్యమైనవని ప్రముఖులు పేర్కొన్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సమాజ ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ వైద్యుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడుతూ, డాక్టర్స్ డే సందర్భంగా వారిని సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు.

### వాసవి క్లబ్ అండగా ఎల్లప్పుడూ ఉంటుంది

వాసవి క్లబ్ జోన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు మాట్లాడుతూ.. సమాజ సేవే లక్ష్యంగా వాసవి క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి గానీ, వైద్యులకు గానీ భవిష్యత్తులో ఏ విధమైన అవసరం వచ్చినా వాసవి క్లబ్ తరఫున తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే కార్యక్రమాలకు తమ క్లబ్ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

### వైద్య వృత్తి సేవకు ప్రతీక

వైద్య వృత్తి మానవ సేవకు ప్రతీక అని, ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తున్న ప్రతి వైద్యుడు అభినందనీయుడని ప్రముఖులు పేర్కొన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అత్యవసర పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్న వైద్యుల అంకితభావాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. డాక్టర్స్ డే వంటి సందర్భాలు వారి సేవలను గుర్తించి కృతజ్ఞతలు తెలియజేసే మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు.

### ఆత్మీయంగా సాగిన కార్యక్రమం

వైద్యులను శాలువాలతో సన్మానించిన అనంతరం వారితో ఆత్మీయంగా మాట్లాడి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి వారు అందిస్తున్న సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. తమ సేవలను గుర్తించి సన్మానించిన వాసవి క్లబ్ సభ్యులకు, పత్రికా విలేకరులకు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు, రాయల పోలయ్య (నమస్తే ఇందూర్), ఎస్కే అబ్బాస్ జన సంఘర్షణ, సరిదే రాజశేఖర్ (అక్షరం), గణేష్ (పొలిటికల్ పవర్), చల్లా రాజేష్ జనం సాక్షి, పరిటాల రాంబాబు ప్రజా ప్రతిభ, రామ్ సాయి కొల్ల అరుణ్ కుమార్, చట్టం బొక్క రాంబాబు, చాకిరేవు మంగరాజు, జ్ఞాన తెలంగాణ నవభారత్, దిలీప్ నార్లపాటి సోమేష్ కేదాశ మంగరాజు తో పాటు పలువురు పత్రికా విలేకరులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డి సి హెచ్ ఎం ఎస్ రవిబాబు , సూపర్డెంట్ డాక్టర్ రాధ రుక్మిణి,ఆర్ఎంవో మౌనిక,గైని కాల్ లిస్ట్ మౌనిక, ఉదయ భాస్కర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్షియ, ఆశా పర్వీన్,సుజాత మత్తు డాక్టర్ నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆస్పత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాలదే భవిష్యత్

- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ఒక అడుగు ముందే ఏపీ
- హీరో మోటార్స్ సంస్థ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన
- సత్యవేడులోని హీరో ప్లాంట్ సందర్శించి సిబ్బందితో మాట్లాడిన ముఖ్యమంత్రి
- బ్రిజ్ మోహన్ లాల్ ముంజల్ హీరోస్ ఆఫ్ టుమారో పేరిట స్కాలర్ షిప్ ను ఆవిష్కరించిన సీఎం




సత్యవేడు, జూలై 01( జన సంఘర్షణ)

భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈవీల తయారీలో హీరో మోటార్స్ సంస్థ పెద్ద ఎత్తున దృష్టి సారించాలని సూచించారు. తిరుపతి జిల్లా సత్యవేడులోని మాదన్నపాలెం వద్ద హీరో మోటార్స్ సంస్థకు చెందిన గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 కు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజాల్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ…"హీరో మోటార్స్ వ్యవస్థాపక ఛైర్మన్ బ్రిజ్ మోహన్ లాల్ ముంజాల్ పారిశ్రామిక వేత్తగా జాతి నిర్మాణానికి సహకరించిన గొప్ప వ్యక్తి. హీరో మోటార్స్ సంస్థ వేరే రాష్ట్రంలో ప్లాంట్ పెట్టాలనుకుంటే వారితో ప్రత్యేకంగా చర్చించి ఏపీలో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఒప్పించాం. 2018లో తిరుపతిలో శంకుస్థాపన చేసిన హీరో మోటార్స్ ప్లాంట్ ఇప్పుడు పెద్ద ఎత్తున వాహనాలను ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు విడా పేరుతో ఎలక్ట్రిక్ టూ వీలర్లను ఉత్పత్తి చేయడం సంతోషంగా ఉంది. హీరో సంస్థకు ఉన్న అన్ని ఉత్పత్తి కేంద్రాల కంటే ఇక్కడి యూనిట్ ను ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయాలి. ప్లాంట్ ఏర్పాటులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం సహకరిస్తుంది. వేగంగా ప్రాజెక్టు యూనిట్ ను పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలి. హీరో సంస్థ ప్రకటించిన మేరకు రూ.3,200 కోట్ల పెట్టుబడులతో ప్లాంట్ విస్తరణ పనులు ప్రారంభించాలని కోరుతున్నాను. భవిష్యత్ అంతా ఈవీలదే. డిమాండ్ కు తగినట్టుగా ఈవీల ఉత్పత్తికి హీరో సంస్థ సిద్దంగా కావాలి. ఇవాళ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 శంకుస్థాపన చేయటం సంతోషంగా ఉంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి ప్రణాళికలు సిద్దం చేసుకున్నాం. ఇప్పటికే 100 గిగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఒక అడుగు ముందే ఉంది. హీరో సంస్థలో పనిచేసే ఉద్యోగుల్లో 40 శాతం మంది మహిళలే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన మహిళలు కష్టపడి పనిచేస్తారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co